క్లుప్తంగా

వేలం పాట ద్వారా రూ.3.89 లక్షల ఆదాయం

అమరాపురం: మండల కేంద్రంలో వారపు సంత, దినసరి సంత, బస్టాండు, మటన్ మార్కెట్‌కు బుధవారం ఈఓఆర్డీ సుధాకర, కార్యదర్శి ఈరన్న సమక్షంలో వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాట ద్వారా మొత్తం రూ.3,89,600 ఆదాయం పంచాయతీకి సమకూరినట్లు ఈఓఆర్డీ సుధాకర తెలిపారు.

రూ.1,96,900 రికవరీకి ఆదేశం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఆర్‌పీ మల్లికార్జున

గుడిబండ: మండలంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో జాతీయ ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్‌లో సామాజిక తనిఖీలో రూ.1,96,900 రికవరీకి ఆదేశించామని ఏపీఓ భార్గవి తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ముందు డ్వామా పీడీ రామాంజినేయులు ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ బహిరంగ సభలో ఎస్‌ఆర్‌పీ మల్లికార్జున బృందం వివరాలు వెల్లడించింది. మండలంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.9 కోట్లు పనులు రూ.1,96,900 దుర్వినియోగం చేసినట్లు గుర్తించామన్నారు. ఆ మొత్తాన్ని రికవరీకి ఆదేశించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీడీ జయసింహా, ఎంపీడీఓ రామారావు, ఎంపీపీ రాధమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్ రద్దు చేయాలని వినతి



తహసీల్దారు సౌజన్యలక్ష్మికి వినతిపత్రాన్ని అందిస్తున్న దృశ్యం

పరిగి: మండల కేంద్రంలోని జయమంగళీ నదిలో ఇసుక రీచ్‌ను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ మండల వైఎస్సార్‌సీపీ నాయకులు తహసీల్దారు సౌజన్యలక్ష్మికి వినతిపత్రాన్ని అందించారు. ఇటీవల పరిగిలో రీచ్‌ను ఏర్పాటు చేసి, ఓ కాంట్రాక్టు కంపెనీకి అనుమతులివ్వడంపై రెండు రోజులుగా రైతులు, స్థానికులతో కలిసి నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో బుధవారం మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నరసింహమూర్తి, ఎంపీపీ సవిత ప్రభాకర్ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దారుకు డిమాండ్లతో కూడిన వినతి నందించారు.

కేఆర్‌పీపీకి ఫుట్‌బాల్ గుర్తు కేటాయింపు

పావగడ: గాలి జనార్దనరెడ్డి స్థాపించిన కళ్యాణ రాజ్య ప్రగతి పార్టీకి ఫుట్‌బాల్ గుర్తును ఎన్నికల సంఘం కేటాయించింది. స్థానిక కేఆర్పీపీ అభ్యర్థి నేరళకుంట నాగేంద్ర బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వచ్చే స్థానిక విధాన సభ ఎన్నికల్లో తప్పక విజయం సాధిస్తామన్నారు. కాంగ్రెస్, జేడీఎస్ అభ్యర్థులతో విసిగి వేసారి పోయిన జనం కేఆర్పీపీ వైపు మొగ్గు చూపుతున్నట్లు చెప్పారు.

పంటలను పరిశీలించిన ఏడీ



రెడ్డిపల్లిలో పంట పొలాలను పరిశీలిస్తున్న ఏడీ సత్యనారాయణ

రొద్దం: మండలంలోని రెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో వివిధ పంటల సాగును బుధవారం ఏడీ సత్యనారాయణ తనిఖీ చేశారు. మండలంలో బీమా పొందుతున్న రైతులు పంటలు సాగు చేస్తున్నారా? లేదా అన్న పలు విషయాలపై అడిగి తెలుసుకున్నారు. అన్ని చోట్ల పంటలు సాగు చేసినట్లు గుర్తించారు. కార్యక్రమంలో ఏఓ నివేదిత, ఏఈఓ అంజాద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు



మాట్లాడుతున్న కమిషనర్ వంశీకృష్ణభార్గవ్

పెనుకొండ: పెనుకొండ మున్సిపల్ పరిధిలో తాగునీటి సమస్యను పరిష్కరించడమే లక్ష్యమని నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్ పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నగర పంచాయితీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, వైస్ చైర్మన్లు సునీల్, నందిని, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపడతామన్నారు. ఇందులో భాగంగానే పలు విషయాలపై చర్చించి సమావేశాన్ని ముగించారు.

జగనన్న చెప్పిందే చేస్తారు.. చేసేదే చెప్తారు

- ఎమ్మెల్యే శంకరనారాయణ





మెగా చెక్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ, సభకు హాజరైన డ్వాక్రా మహిళలు

రొద్దం: వైఎస్సార్ ఆసరాతో మహిళలకు ఆర్థిక భరోసా లభిస్తుందని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో డ్వాక్రా పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా మూడో విడత మెగా చెక్ పంపిణీ కార్యక్రమం జరిగింది. జ్యోతి ప్రజ్వలన అనంతరం సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి మెగా చెక్‌ను అందజేశారు. ఎంపీపీ చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎమ్మెల్యే శంకరనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చెప్పిందే చేస్తారు... చేయగలిగిందే చెబుతారని స్పష్టం చేశారు. పాదయాత్రలో మహిళ సంఘ సభ్యులను రుణాల నుంచి విముక్తి చేస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని చెప్పారు. మూడో విడత ఆసరా కింద శ్రీరామ నవమి కానుకగా రొద్దం మండలంలో 874 సంఘాల్లోని 8,796 మంది సభ్యులకు రూ.8.34 కోట్లను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కరోనాతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నా చెప్పిన మాట ప్రకారంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్నే అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కరోనాను ఆరోగ్యశ్రీలోకి తెచ్చి ప్రజల ప్రాణాలు కాపాడిన ప్రాణదాత జగన్ అన్నారు.

టీడీపీ దొంగల పార్టీ..

గతంలో చంద్రబాబు 600 మోసపూరిత హామీలు ఇచ్చి ఏ ఒక్కటి అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేశారని ఎమ్మెల్యే విమర్శించారు. తెలుగుదేశం పార్టీ ఒక దొంగల ముఠా అన్నారు. మాజీ ఎమ్మెల్యే పండగ పూట తప్ప ప్రజలకు ఎప్పుడు కనిపించరని ఎద్దేవా చేశారు. మాజీ ఎమ్మెల్యే అల్లుడు సారా, ఇసుక వ్యాపారం చేసిన సంగతి మండల ప్రజలకు తెలుసునన్నారు. పెనుకొండ టీడీపీ నాయకురాలు సవితమ్మ కర్ణాటక నుంచి డీజిల్ తెచ్చుకుని దొంగ వ్యాపారం చేసిన సంగతి ఎవరూ మర్చిపోలేదన్నారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండాలని తాను పెనుకొండలో ఇల్లు కట్టుకుంటే వారికి ఎందుకు కడుపుమంటో చెప్పాలన్నారు. జగనన్న ప్రభుత్వంలో ఎక్కడా ఇసుక అక్రమంగా రవాణా జరగలేదన్నారు. పనిచేస్తున్న ప్రభుత్వంపై లేని పోని తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలన్నారు.

చంద్రబాబు మాటలను నమ్మొద్దు..

మహిళలను మోసం చేయడానికి మళ్లీ చంద్రబాబు మన ముందుకు వస్తారని, చంద్రబాబు మోసపూరిత మాటలకు ఏ ఒక్క మహిళా నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్సీ సానిపల్లి మంగమ్మ కోరారు. డ్వాక్రా మహిళను అన్ని విధాల మోసం చేసిన ఘనుడు చంద్రబాబు అన్నారు. మహిళలకు పెద్ద పీట వేసిన వైఎస్ జగన్‌ను మళ్లీ అందరూ ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రూప, రాష్ట్ర స్వచ్ఛంధ్రా కార్పొరేషన్ డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతిరెడ్డి, వైస్ ఎంపీపీలు హరితాలక్ష్మి, రామాంజినమ్మ, సచివాలయాల సమన్వయకర్త ఆర్‌పీ రవిశేఖర్‌రెడ్డి, కలిపి సింగిల్ విండో చైర్మన్ కేపీ శ్రీనివాసులు, సింగిల్ విండో మాజీ చైర్మన్ రాజారెడ్డి, నాయకులు కలిపి శ్రీనివాసులు, రాజగోపాల్‌రెడ్డి, ఏసీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన నవీన్‌నిశ్చల్



ముఖ్యమంత్రిని కలిసిన ఆగ్రో చైర్మన్ నవీన్‌నిశ్చల్

హిందూపురం: రాష్ట్ర ఆగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్ నవీన్‌నిశ్చల్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిశారు. విజయవాడలోని తాడేపల్లిలో సీఎం క్యాంప్ కార్యాలయంలో ఏపీ ఆగ్రోస్ కార్పొరేషన్ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేషన్ చైర్మన్ నవీన్ నిశ్చల్ సీఎంను కలిసి వ్యవసాయానికి ఆగ్రోస్ కార్పొరేషన్ ద్వారా చేపట్టిన లబ్ధిపై చర్చించినట్లు వెల్లడించారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన



డ్రమ్ములతో ఉన్న ఆటో

పావగడ: రాష్ట్ర వ్యాప్తంగా విధాన సభ ఎన్నికల తేదీని కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం ప్రకటించింది. ఇదే రోజు నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని వెల్లడించింది. అయితే కోడ్ నిబంధనలను ఉల్లంఘిస్తూ స్థానిక మున్సిపల్ అధికారులు నీటి డ్రమ్ములను లబ్ధిదారులకు మధ్యాహ్నం 1 గంట సమయంలో పంపిణీ చేశారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని జేడీఎస్ నాయకుడు రామాంజినప్ప డిమాండ్ చేశారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం భరోసా

- అదనపు గదుల ప్రారంభంలో ఎమ్మెల్యే శంకరనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

పెనుకొండ రూరల్: ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గుట్టూరు ప్రభుత్వాస్పత్రిలో నూతనంగా నిర్మించిన అదనపు గదులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇచ్చేందుకే ప్రభుత్వం నేడు ప్రతి పార్లమెంట్‌కి ఒక మెడికల్ కళాశాలను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. గ్లోవిస్ కంపెనీ దాదాపుగా రూ.32 లక్షలు వెచ్చించి ఆస్పత్రిలో నాలుగు గదులను నిర్మించి, మరిన్ని సౌకర్యాలను సమకూర్చడం హర్షించదగిన విషయమన్నారు. గ్లోవిస్ కంపెనీ ప్రతినిధులను అభినందిస్తూనే గ్రామాల్లో మినరల్ వాటర్, కమ్యూనిటీ భవనాలు, లైబ్రరీ వంటి మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని కోరారు. ఈ ప్రాంతం పారిశ్రామికంగా, వ్యవసాయపరంగా అభివృద్ధి చెందాలని ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహాయక సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు. కియా పరిశ్రమ ఇక్కడకు వచ్చిందంటే, ఇక్కడ ఉన్న మౌలిక వసతులు, పొరుగు రాష్ట్రం అయిన బెంగళూరు రవాణా సదుపాయాలకు అనువుగా ఉండటమే కారణమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, గ్లోవిస్ ఎండీ జోషియోక్ హూం, జెడ్పీటీసీ సభ్యులు శ్రీరాములు, ఎంపీపీ గీతా రామ్మోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ నాగభూషణ బాబు, ఎంపీటీసీ సభ్యురాలు నిర్మల, నారాయణస్వామి, పిట్టా బాబు, రామచంద్ర, ఆదిశేషు, మహేంద్ర, బషీర్, రిజ్వాన్, కొండల రాయుడు, కురుబవాండ్లపల్లి సర్పంచ్ నాగమూర్తి, వీజే పాళ్యం ఆదినారాయణ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ మంజువాణి, మెడికల్ ఆఫీసర్లు నాగరాజు నాయక్, శ్రావణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'శ్రీరామ నవమి'కి భారీ ఏర్పాట్లు



సూగూరు ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన 50 అడుగుల శ్రీరామచంద్రుడి కటౌట్

హిందూపురం: శ్రీరామ నవమి పండుగ సందర్భంగా హిందూపురంలోని సూగూరు ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద భారీగా ఏర్పాట్లు చేపట్టారు. బుధవారం ఉదయం మూలవిరాట్ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను ప్రాకారోత్సవం చేశారు. తర్వాత సాయంత్రం 6 గంటలకు బ్రహ్మరథోత్సవానికి అంకురార్పణ, ధ్వజారోహణం చేశారు. గురువారం ప్రాకారోత్సవం తర్వాత సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఈఓ నరసింహమూర్తి తెలిపారు. అనంతరం రథోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. సాయంత్రం ఉట్ల పరుష, లంకాదహనం కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. 31న సీతారాముల పట్టాభిషేకం ఉంటుందని తెలిపారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

మడకశిర: నియోజకవర్గంలో ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. 6 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు జరిగాయి. చివరి రోజు 31 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు.1,549 విద్యార్థులకుగాను 1,518 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. మడకశిరలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 305 మందిగాను 292 మంది పరీక్షలు రాశారు. 13 మంది హాజరు కాలేదు. ఒకేషనల్ జూనియర్ కాలేజీలో 388 మందికిగాను 385 మంది పరీక్షలు రాయగా ముగ్గురు హాజరు కాలేదు. వెంకటేశ్వర జూనియర్ కాలేజీలో 254 మందికిగాను 245 మంది పరీక్షలు రాశారు. అమరాపురంలో 238 మందిగాను 236 మంది పరీక్షలు రాశారు. అగళిలో 187 మందికిగాను 183 మంది హాజరు కాగా నలుగురు గైర్హాజరయ్యారు. గుడిబండలో 177 మందికిగాను అందరూ పరీక్ష రాశారన్నారు.

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి ఏపీఆర్‌జేసీలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. బుధవారం ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఎకనామిక్స్, కామర్స్ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 318 మంది హాజరుకావాల్సి ఉండగా 311 మంది పరీక్ష రాశారని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు.

నూతన రథం సిద్ధం



రథోత్సవానికి సిద్ధమైన నూతన రథం

చిలమత్తూరు: మండలంలోని కోడూరు పంచాయతీ మల్లో తోపులో వెలసిన శ్రీరామాలయం శ్రీరామ నవమికి ముస్తాబైంది. గురువారం రథోత్సవం జరగనుండగా ఈ ఏడు రూ.10.50 లక్షలు వెచ్చించి నూతన రథాన్ని తయారు చేయించినట్లు సర్పంచ్ మురళీమోహన్ తెలిపారు.

జగనన్నతోనే వాల్మీకులకు న్యాయం



వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

మడకశిర: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే వాల్మీకి, బోయ కులస్తులకు అన్నివిధాలుగా న్యాయం జరిగిందని వాల్మీకి, బోయ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ తెలిపారు. వాల్మీకి, బోయ కులస్తులను ఎస్టీలుగా గుర్తించాలని కోరుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అసెంబ్లీలో తీర్మానం చేయడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌లో బుధవారం వైఎస్ జగన్ చిత్రపటానికి వారు క్షీరాభిషేకం చేశారు. అలాగే వాల్మీకి విగ్రహానికి కూడా పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అమరాపురం ఎంపీపీ ఈరన్న, వాల్మీకి, బోయ సంఘం నాయకులు సత్యనారాయణరెడ్డి, శ్రీరాములు, తిమ్మప్ప, శివకుమార్, అంబరీష్, రత్నగిరి దొర, సతీష్, మధు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన



కె.బసవనపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో పరీక్షా కేంద్రం గదిని పరిశీలిస్తున్న ఎంఈఓ గంగప్ప

హిందూపురం టౌన్: ఏప్రిల్ 3 నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యాశాఖాధికారులు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం కె.బసవనపల్లి జెడ్పీహెస్ పాఠశాలతో పాటు కొట్నూరు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులకు అనుగుణంగా పరీక్షా కేంద్రంలో కుర్చీలు, లైట్లు, ఫ్యాన్లు ఉన్నాయా? లేదా? అని పరిశీలించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లోని గదుల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. హిందూపురం మండలంలో 13 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, 3,380 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. అలాగే వీవర్స్‌కాలనీ సమీపంలో ఎన్టీఆర్‌కాలనీలో నాడు-నేడు పనులను పరిశీలించారు.

అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

హిందూపురం టౌన్: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణ కోసం ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఏప్రిల్ 6న పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక బస్సును ఏర్పాటు చేశామని, ఏప్రిల్ 5న సాయంత్రం 5 గంటలకు హిందూపురం నుంచి బస్సు బయలుదేరుతుందన్నారు. ఏప్రిల్ 6న ఉదయం 3 గంటలకు అరుణాచలం చేరుతుందన్నారు. గిరి ప్రదక్షిణ తర్వాత మధ్యాహ్నం 2 గంటలకు తిరిగి బయలుదేరి శ్రీపురం గోల్డెన్ టెంపుల్, కాణిపాకం శ్రీసిద్ధి వినాయకుని దర్శించుకుని మరుసటి రోజు 4 గంటలకు హిందూపురం చేరుతుందన్నారు. టికెట్ ధర రిజర్వేషన్‌తో కలిసి రూ.1320 అని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 7382863007ను సంప్రదించాలన్నారు.

వలంటీర్ల ఎంపికకు ఇంటర్వ్యూ



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ఏఓ భాస్కర్

అమరాపురం: మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓ భాస్కర్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలను సజావుగా నిర్వహించారు. మొత్తం 13 వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉండగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన వారికి త్వరలోనే నియామక పత్రాలు అందజేస్తామన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



అమరాపురం: పౌష్టికాహారాన్ని తయారు చేస్తున్న దృశ్యం

అమరాపురం: గర్భిణులు, బాలింతలు, ప్రీ స్కూల్ పిల్లలు, కిశోర బాలికలు ప్రతి రోజూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో మండలంలోని అంగన్‌వాడీలతో పౌష్టికాహార పక్షోత్సవాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు, సలహాలిచ్చారు. ఈ సందర్భంగా పోషకాహార ఎగ్జిబిషన్‌ను అందరూ తిలకించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కమలమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రొళ్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలామృతం, వైఎస్సార్ సంపూర్ణ ఆహారాల కిట్లను చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సక్రమంగా అందించి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండే విధంగా కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సన్నమ్మ పేర్కొన్నారు. బుధవారం స్థానిక లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం కమ్యూనిటీ భవనం ఆవరణంలో వివిధ గ్రామాల అంగనవాడీ సెంటర్లలో విధులు నిర్వహిస్తున్న కార్యకర్తలతో సంపూర్ణ పౌష్టికాహారాల పక్షోత్సవాల భాగంగా సమీక్షా సమావేశం నిర్వహించారు. తొలుత స్థానిక సీహెచ్‌సీలో ఆరోగ్య, అంగనవాడీ, ఆశ వర్కర్లతో పాటు సిబ్బందితో సమీక్షించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ సన్నమ్మ మాట్లాడుతూ ఆరు నెలల వయస్సు నుంచి మూడేళ్ల చిన్నారులకు బాలామృతంతో పాటు రోజు వంద ఎంఎల్ పాలు, ఒక గుడ్డును తప్పని సరిగా అందించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు రోజూ సెంటర్లలో పౌష్టికాహారంతో కూడిన భోజనం, 200 ఎంఎల్ పాలు, వైఎస్సార్ కిట్లను అందించాలన్నారు.

టెన్త్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తాం

మడకశిర: నియోజకవర్గంలో ఏప్రిల్ 3 నుంచి టెన్త్ పరీక్షలను పగడ్బందీగా నిర్వహించడానికి చర్యలు చేపట్టినట్లు మడకశిర,గుడిబండ, అగళి, అమరాపురం, రొళ్ల మండలాల ఎంఈఓలు భాస్కర్, శ్రీధర్, గోపాల్, సత్యనారాయణ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయన్నారు. మడకశిరలోని 7 కేంద్రాల్లో 1,480 మంది, అమరాపురంలో 3 కేంద్రాల్లో 671 మంది, గుడిబండలో 3 కేంద్రాల్లో 540 మంది, అగళిలో 2 కేంద్రాల్లో 366 మంది, రొళ్లలో 2 కేంద్రాల్లో 471 మంది చొప్పున టెన్త్ విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

జేబుదొంగల హల్‌చల్

సోమందేపల్లి: మండల కేంద్రంలో బుధవారం నారా లోకేష్ యువగళం పాదయాత్ర జరిగింది. ఇందులో భాగంగానే జేబు దొంగలు హల్‌చల్ చేశారు. ఇందిరానగర్‌కు చెందిన శివ అనే వ్యక్తి జేబులో ఉన్న రూ.10 వేలతో పాటు నల్లగొండ్రాయనిపల్లి క్రాస్ వద్ద మరో వ్యక్తి జేబులో రూ.2 వేలు దోచేశారు. అయితే పోలీసులకు మాత్రం వారు ఫిర్యాదు చేయలేదు.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

మడకశిరరూరల్: మండల పరిధిలోని బుళ్లసముద్రంలో బుధవారం ప్రభుత్వ ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో విలేజ్ టూ వైస్ చాన్సలర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రమణ రైతుల పంటలను పరిశీలించి పలు సూచనలు, సలహాలిచ్చారు.

సజావుగా వేలం

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షిలోని గ్రామ సచివాలయంలో బుధవారం ఉదయం సర్పంచ్ ఆదినారాయణ ఆధ్యక్షతన వారపు సంత, బస్టాండులో పార్కింగ్ స్థలానికి బహిరంగా వేలం నిర్వహించారు. బస్టాండు పార్కింగ్ స్థలాన్ని నరసింహమూర్తి రూ. రూ. 50 లక్షలకు దక్కించుకున్నారు. వారపు సంతను నయాజ్ రూ. 2.85 లక్షలకు దక్కించుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి నాగేంద్రకుమార్ తెలిపారు.

చలివేంద్రాల ఏర్పాటు



పట్టుగూళ్ల మార్కెట్ ఆవరణలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న పట్టుగూళ్ల అధికారి లక్ష్మీరెడ్డి

హిందూపురం టౌన్: కైవారం యోగి నారాయణ యతీంద్రుల వారి భక్త బృందం ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. మున్సిపల్ కార్యాలయంలో బీజేపీ నాయకులు, పట్టుగూళ్ల మార్కెట్‌లో పట్టుగూళ్ల అధికారి లక్ష్మీరెడ్డి, ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు చలివేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో యోగినారాయణ సేవా సమితి అధ్యక్షుడు రవిశంకర్, బీజేపీ నాయకులు పార్థసారథి, ఆదర్శ కుమార్, శంకర్, స్వామి భక్త బృందం నాగరాజు, జగదీష్, రాజ్యలక్ష్మీ మోహన్, వెంకటేష్, వెంకటరామిరెడ్డి, సునీల్, గోవిందరాజులు, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం



ఎం.వెంకటాపురంలో జ్యోతులు మోస్తున్న మహిళలు

లేపాక్షి: మండలంలోని పులమతిలో వెలసిన ఆంజనేయస్వామికి, ఎం.వెంకటాపురంలో వెలసిన శ్రీరామచంద్రస్వామి వార్లకు గ్రామస్తులు బుధవారం ఉదయం జ్యోతులు మోశారు. ప్రతి ఏడాది శ్రీరామినవమి పండుగకు ముందు రోజు జ్యోతులు మోయడం, పండుగ రోజు సీతారాముల బ్రహ్మరథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగానే స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేషంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి నుంచి జ్యోతులను దేవాలయం వరకు ఊరేగింపుగా వచ్చి స్వామి వారికి సమర్పించారు. సాయంత్రం సీతారాముల కల్యాణోత్సవాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. పులమతిలో గురువారం మధ్యాహ్నం సీతారాముల బ్రహ్మరథోత్సవం జరుగుతుందని కార్యనిర్వాహకులు ప్రభాకర్‌రావు పేర్కొన్నారు.